పండగ కళ



- గాజువాక మార్కెట్లు కిటకిట
- షాపింగ్‌కు పోటెత్తిన కస్టమర్లు
- నేడు భోగి పండగ...
- రేపు మకర సంక్రాంతి





గాజువాక మెయిన్ రోడ్‌లో జనం రద్దీ

గాజువాక: సంక్రాంతి షాపింగ్‌లతో గాజువాక మార్కెట్లు కిటకిటలాడాయి. సంక్రాంతి సమీపించడంతో వ్యాపార సంస్థలు, వస్త్ర దుకాణాలు కళకళలాడాయి. గాజువాకలో షోరూంలు, వ్యాపార సంస్థలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. వీటితో పాటు రోడ్డు మార్జిన్‌లో వ్యాపారాలకు కూడా ఏమాత్రం ఆదరణ తగ్గలేదు. వ్యాపారులు కోల్‌కతా, చెన్నై, రాజస్థాన్, తిరుపూర్‌వంటి ప్రాంతాల నుంచి రెడీమేడ్ దుస్తులు తెచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయేవరకూ ఇసుకేస్తే రాలనంతగా రహదారుల్లో రద్దీ చోటుచేసుకుంటోంది. ఇతర జిల్లాలకు చెందిన వారు సంక్రాంతికి తమ ప్రాంతాలకు వెళ్లే ఇక్కడే పండగ షాపింగ్ చేశారు. ఈ కారణంగా షోరూమ్‌లతోపాటు రోడ్డు దుకాణాలకు కూడా కొనుగోలుదారులు పోటెత్తారు. మరోవైపు భోగి రోజు,సంక్రాంతి రోజు పూజలకు అవసరమైన సామగ్రి కొనుగోళ్లతో సందడి నెలకొంది. చెరకుగడలు, గుమ్మడి కాయలు, కలగూరకు అవసరమైన కూరగాయలు కొనుగోలు చేసిన వారితో మహిళా రైతు బజారుతో పాటు ఇతర మార్కెట్లు రద్దీగా మారాయి.



ఊళ్లకు వెళ్లేవారితో కిటకిటలాడుతున్న పాతగాజువాక బస్‌స్టాప్



రంగులు విక్రయిస్తున్న దృశ్యం

కాలనీలు ఖాళీ

సంక్రాంతికి గాజువాకలోని వివిధ ప్రాంతాలు ఖాళీ అవుతున్నాయి. ఉపాధి కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చి నివాసముంటున్నవారు కుటుంబాలతో సహా తమ సొంతూళ్లకు పయనమయ్యారు. గాజువాకలోని భానోజీతోట, ఎల్‌బీఎస్‌నగర్, దశమికొండ, శ్రీనగర్, సుందరయ్యకాలనీ, సింహగిరి కాలనీ, దయాళ్‌నగర్, పైడిమాంబ కాలనీ, పెంటయ్యనగర్, కష్ణానగర్, గణేష్‌నగర్, బొజ్జన్నకొండతోపాటు అప్పన్న కాలనీలు అప్పుడే బోసిపోయాయి. భోగి రోజు మిగిలిన వారు కూడా సొంత ఊళ్లకు వెళ్లిపోతారు. 30 శాతం మంది మాత్రమే ఇక్కడ పండగ జరుపుకుంటారు.




పిండి వంటలు బంధువులకు పంపిస్తాం

సం క్రాంతి పండగకు పిండి వంటలు తయారు బంధువులకు పంపడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం అన్ని రకాల పిండి వంటలు షాపుల్లో అందుబాటులో దొరుకుతున్నాయి. గతంలోలా కష్టపడి తయారు చేయావల్సిన అవసరం లేదు. ముఖ్యమైన వాటిని తయారు చేసుకుని మిగిలివాటిని మార్కెట్‌లో తయారు చేయించుకుని బంధువులకు స్నేహితులకు పంచిపెడుతున్నాం. – కొత్త శ్రీలక్ష్మి , పెదగంట్యాడ

మార్కెట్‌లో సందడి..

సంక్రాంతి కావాల్సిన అన్ని వస్తువులు మార్కెట్‌లో లభిస్తున్నాయి. ముగ్గులు, రంగులు,భోగి పిడకలు, పతంగులు, పిండి వంటలు అన్నీ దొరుకుతున్నాయి.వివిధ ఆకృతుల్లో తయారు చేసిన గాలి పటాలు చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



పిండి వంటల నుంచి.. భోగి పిడకల వరకూ



పెదగంట్యాడ: సంక్రాంతి అంటే తెలుగింట పెద్ద పండగ. డూడూ బసవన్నలు, ఇళ్ల ముందు రంగవల్లులు, పిండి వంటలతో ప్రతి ఇంటా సందడి మొదలవుతుంది. కొత్త అల్లుళ్ల రాకతో ఇళ్లు కళకళలాడుతాయి. పెద్దవాళ్లకు కోడి పందాలు, ఎడ్ల పందాలతో సందడి చేయగా చిన్నా పెద్దా కూడా పతంగులు ఎగర వేస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. ప్రజల అభిరుచికి తగ్గట్టుగా ఇప్పుడు పిండివంటలు కూడా రెడీమేడ్‌గా లభిస్తున్నాయి. పలు స్వీట్ షాపుల్లో అన్ని రకాల పిండి వంటలు దొరుకుతున్నాయి..పండగ పూట అమ్మచేతితో తయారు చేసిన వంటకాలు మాదిరి ఆకట్టుకుంటున్నాయి. అరిసెలు, సున్నుండలు, జంతికలు, కజ్జికాయలు వంటి వాటిని వినియోగదారుల ఆర్డర్ల మేరకు తయారు చేసి అందజేస్తున్నారు. ఇక భోగాలను ఇచ్చే భోగి మంటకు కీలకమైన పిడకలను సైతం ఆన్‌లైన్‌తో పాటు దుకాణాల్లో విక్రయిస్తున్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కల్యాణరాట



గోదాదేవి రంగనాయకుల కల్యాణ రాట వేస్తున్న భక్తుల

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబేకాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణ రాట మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ప్రదీప్ చంద్ర, సహాయ అర్చకుడు తాత ఆచార్యులు రాట వేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విశేష పూజలు చేశారు.

54వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న ఉక్కు ఉన్నతాధికారి శ్రీనివాస్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం డీజీఎం (ఆపరేషన్స్)గా విధులు నిర్వహిస్తున్న కర్రి శ్రీనివాస్ 54వ సారి రక్తదానం చేశారు. చాలా అరుదైన గ్రూపు (ఓ–నెగిటివ్) రక్తాన్ని దానం చేసి రికార్డు నెలకొల్పారు. అక్కయ్యపాలేనికి చెందిన ఖాదర్ జిలానీ (60) కాలు జారి కింద పడిపోవడంతో కాలు విరిగిపోయి ఎముక బయటకు వచ్చింది. కేజీహెచ్‌లో అత్యవసరంగా ఆపరేషన్ చేయాల్సి రావడంతో శ్రీనివాస్ స్పందించి రోటరీ బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తాన్ని దానం చేశారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

15న ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న తుంగ్లాం గ్రామ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం గ్రామ నాయకుడు స్వర్గీయ కాకి కుంచారావు జ్ఞాపకార్థం సంక్రాంతి సందర్భంగా ఈ నెల 15న గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి తెలిపారు. గ్రామంలోని విజయ రాఘవ స్వామి ఆలయం వద్ద ఆదివారం ముగ్గుల పోటీల కరపత్రాన్ని ఆవిష్కరించారు. మొదటి బహుమతి విజేతకు రూ.15 వేలు, ద్వితీయ విజేతకు రూ.10 వేలు, తృతీయ బహుమతి కింద రూ.5 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నావాన సింహాచలం, పెట్లి అర్జునరావు, విరోతి వరహాలరావు, కొల్లి కుంచారావు, దూడ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవి కల్యాణానికి ఏర్పాట్లు



గోదాదేవి చెంత పూజ చేస్తున్న అర్చకులు

ఉక్కునగరం: ధనుర్మాసం సందర్భంగా ఉక్కునగరం సెక్టార్–1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి చెంత ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించిన అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి పాశురం వినిపించారు.

గిరి ప్రదక్షిణ నేడు

ధనుర్మాసం సందర్భంగా వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గిరి ప్రదక్షిణ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఏడు గంటలకు గోదాదేవి రంగనాథుల కల్యాణోత్సవం ఘనంగా జరిపించనున్నట్టు కమిటీ పేర్కొంది.

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాలి



మటన్ స్టాల్స్ వద్ద అవగాహన కల్పిస్తున్న తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు



స్టీల్‌బాక్స్‌లో చేపలు వేయిస్తున్న తిరుమల నగర్‌వాసి

అగనంపూడి: ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, స్టీల్‌పాత్రలు వినియోగించాలని తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు కోరారు. 87వ వార్డు తిరుమలనగర్‌లోని చేపలు, మాంసం మార్కెట్‌లో ఆదివారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే అనర్థాలు తెలిసి కూడా ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నామని, దీని వల్ల భవిష్యత్‌లో ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రతీ ఒక్కరూ మార్కెట్‌కు వెళ్లేటప్పుడు క్లాత్ సంచులు, స్టీల్‌పాత్రలతో వెళ్లాలన్నారు. కార్యక్రమంలో పరమానందం, వసంతరెడ్డి, శ్రీరాములు, కామరాజు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పండగకు ఊరు వెళ్తున్నారా.. బహుపరాక్

సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐ శ్రీనివాసరావు



అక్కిరెడ్డిపాలెం: పండగలకు ఊళ్లు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని గాజువాక పోలీసులు సూచిస్తున్నారు. పట్టణ ప్రాంతాల నుంచి వారి వారి గ్రామాలకు వెళ్లే వారు విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు భద్రంగా ఉంచుకోవాలంటున్నారు. చోరీల కట్టడికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే పలు కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో పండగ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే ఇంటి ముందు గాని, సమీపంలో దొంగతనాలు జరిగినట్టు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐ పి.శ్రీనివాసరావు కోరారు.

పండగ సెలవులకు వెళ్లే వారు సమాచారాన్ని స్టేషన్‌లో తెలియజేస్తే పోలీసులు వారి ఇంటికి ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు ఏర్పాటు చేస్తారని తెలిపారు. యాప్‌లో తమ వివరాలు పొందుపర్చాలని సూచించారు.

చోరీల నియంత్రణకు పోలీసుల సూచనలివీ

- ప్రయాణిస్తున్న ట్రావెల్స్ వివరాలు సోషల్ మీడియాలో పెట్టవద్దు.
- ఇంటి లోపల, బయట, ఎంట్రీ, ఎగ్జిట్‌లలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలి.
- ఊర్లు వెళ్లేవాళ్లు ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలు, నగదు తమ వెంట తీసుకువెళ్ల కుండా బ్యాంకు లాకర్లలో భద్ర పర్చుకోవాలి.
- ఊర్లు, విహార యాత్రలకు వెళ్లే వాళ్లు వివరాలను పోలీస్ స్టేషన్‌లో చెప్పి వెళ్లాలి.
- పెద్ద పెద్ద భవనాలు, అపార్ట్‌మెంట్లలో సెక్యూరిటీ గార్డులను పెట్టి జాగ్రత్తగా గమనించమని చెప్పాలి.
- ఊర్లు వెళ్లే టప్పుడు ఇంటి పక్కవారికి లేదా తెలిసిన వారికి తమ ఇంటిని గమనించమనాలి.
- ఏదైనా సమస్య వస్తే డయల్ 112కు లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి.
- అనుమానాస్పద వ్యక్తులు మీ మీ ఏరియాల్లో తిరిగితే పోలీసులకు సమాచారం అందించండి.
- ఇంటికి స్మార్ట్ లాకర్ల ఏర్పాటు చేసుకోవాలి. ఈ లాకర్లను దొంగలు ముట్టినా.. వేరే తాళం ఉపయోగించినా లాకర్ నుంచి పెద్ద శబ్దంతో అలారం మోగుతుంది.

ఘనంగా యువజన దినోత్సవం



వివేకానందుడి జీవిత చరిత్ర పుస్తకాలు పంపిణీ చేస్తున్న జీలకర్ర రమణ తదితరులు



తుంగ్లాంలో వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: సమాజ హితాన్ని కాంక్షించే స్వామి వివేకానంద జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని 76వ వార్డు బీజేపీ అధ్యక్షుడు జీలకర్ర రమణ అన్నారు. విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు జీలకర్ర భువనేశ్వరి ఆధ్వర్యంలో యువజన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాలచెరువులోని కార్యాలయంలో వివేకానందుడి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అద్దంకి రాఘవాచార్యులు,దుర్గాప్రసాద్, గొందేశి గురప్పరెడ్డి, భవాని, నాగబాబు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత

అక్కిరెడ్డిపాలెం: స్వామి వివేకానందుని జీవితం యువతకు ఆదర్శనీయమని మార్కండేయ యువజన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి గిడితూరి అప్పారావు అన్నారు. స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని ఆదివారం 69వ వార్డు తుంగ్లాంలోని చేనేత భవనంలో మార్కండేయ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ప్రతినిధులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ వివేకానందుని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి నావన వెంకట అప్పారావు, కొల్లి గంగరాజు, పసిగడుగుల కనకారావు, శీరం అప్పారావు, నేమాల సన్నిబాబు, నేమాల అప్పలరాజు, కొల్లి గోవిందరావు, కాపు ముత్యాలు, నీలి సాయి, రాజేష్, మాడిమి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్టాలిన్ తదితరులు

గాజువాక: శ్రీకాకుళం జిల్లాలో వచ్చేనెల 6 నుంచి పదో తేదీ వరకు నిర్వహించనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆదివారం సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎ.జె.స్టాలిన్ ఆవిష్కరించారు. చైతన్యనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల వైఫల్యాలపై ఈ మహాసభలో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కె.అచ్యుతరావు, కసిరెడ్డి సత్యనారాయణ, జి.ఆనంద్, అప్పారి విష్ణుమూర్తి, పి.దుర్గారావు, కె.శివకుమార్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీ, క్యాష్ ప్రైజ్ అందజేస్తున్న కార్పొరేటర్ గోవింద రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ హార్ట్ ఫుల్ ఓల్డ్ అండ్ న్యూ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం సాయంత్రంతో ముగిసింది. భెల్ టౌన్ షిప్‌లోని క్రీడా మైదానంలో జరిగిన టోర్నమెంట్ ఫైనల్స్‌లో గ్రీన్ పాన్ 11 విన్నర్స్‌గా, డంగల్ 11 రన్నర్స్‌గా నిలిచాయి. విజేత జట్టుకు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి ట్రోఫీతో పాటు రూ.10000 క్యాష్ ప్రైజ్ అందజేశారు. బీహెచ్‌పీవీ ఓల్డ్, భెల్ న్యూ ఉద్యోగుల కుటుంబాల పిల్లల కోసం బీహెచ్‌పీవీ హార్ట్ ఫుల్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్ మూడు రోజుల పాటు ఉత్సాహంగా జరిగింది. కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీరాములు, గలావిల్లి శ్రీనివాస్, పల్సబైక్ డ్యాన్సర్ ఝాన్సీ, వీనా (యుఎస్‌ఏ), పీటీ మాస్టర్ త్రిమూర్తులు, హీరో రోహన్, ఫ్రెండ్స్ ప్రతినిధులు రామ్‌జానే, రవి, నాని, రమేష్, కృష్ణ, నాయుడు, ఆనంద్, పి.శ్రీను, కుమార్, శ్రీకర్ పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి అవసరం



విజేతలకు ట్రోఫీ ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్

గాజువాక: యువతలో క్రీడా స్ఫూర్తి పెరగాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక లంకా మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన మణి యాదవ్ మెమోరియల్ విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు ఆయన ఆదివారం బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, రాజు, చట్టి గోపి తదితరులు పాల్గొన్నారు.

కోలాటానికి పూర్వ వైభవం

- ఆసక్తిగా నేర్చుకుంటున్న పిల్లలు, మహిళలు
- భగవంతుని సేవలో తరిస్తున్న వైనం



శ్రీహరి హర కోలాటం భజన మండలి సభ్యులు



కోలాటంలో బృంద సభ్యులు

పెదగంట్యాడ: ప్రాచీన కళలకు పూర్వ వైభవం వస్తోంది. పాశ్చాత్య సంస్కృతి విశ్వవ్యాప్తం అవుతున్న వేళ.. కొంత మంది భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను భావి తరాలకు తెలియజేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నారు. పాశ్చాత్య పోకడల నుంచి యువతను తెలుగు జానపదాల వైపు నడిపించాలనే ఆలోచనతో తమకు వచ్చిన కళను పది మందికి పంచుతున్నారు. ఆధ్యాత్మిక సేవలో తరించడంతో పాటు ఉపాధి పొందుతున్నారు. ఆ కోవకు చెందుతుంది కోలాటం. ఈ కళను ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా చిన్నా పెద్దా అంతా నేర్చుకుంటున్నారు. దీంతో ఏ చిన్న ఆధ్యాత్మిక కార్యక్రమం తలపెట్టినా కోలాట బృందాలు సందడి చేస్తు న్నాయి.

ఇటీవల కాలంలో ప్రాచీన కళ.. జానపద నృత్యం.. కోలాటం ప్రతి ప్రాంతంలోనూ కనిపిస్తోంది. నాటి వైభవంతో కళకళలాడుతోంది. మహిళలు బృందంగా ఏర్పడి.. చిరుతలు కొడుతూ.. పాటకు తగ్గట్టుగా పదం కలుపుతూ ముందుకు సాగుతున్నారు. కోలాటం గొప్పతనాన్ని చాటి చెబుతున్నారు. భావి తరాలకు ఆ కళా వైభవాన్ని వివరిస్తున్నారు.

పెరిగిన ఆదరణ

కోలాటానికి ఇప్పుడు మండలంలో విశేష ఆదరణ లభిస్తోంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కో ఆలయం వద్ద కొంతమంది మహిళలు బృందంగా ఏర్పడి సాయంత్రం సమయాల్లో నేర్చుకుంటున్నారు. బృందంలోని సభ్యులంతా ఒకే రకమైన చీరలు కట్టుకుని అన్నమయ్య కీర్తనలు, భక్తి పాటలకు అనుగుణంగా పాదాలు కదుపుతూ నృత్యం చేస్తున్నారు.

వేడుకల్లో ప్రదర్శనలు

ఉగాది మొదలు కొని సంక్రాంతి వరకూ.. వేడుక ఏదైనా.. సంబరం ఎక్కడైనా.. ఉత్సవాల్లో కోలాట బృందాలు కనిపిస్తున్నాయి.. తమదైన నృత్య ప్రదర్శనలతో అలరిస్తున్నాయి. ఆలయాల్లో తరచూ జరిగే ప్రతి వేడుకలోనూ కోలాటం ఉంటుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. చిన్నారులు సైతం కోలాటంపై ఆసక్తి పెంచుకోవడం విశేషం.

చక్కని వ్యాయామం



కోలాటం చేయడం చక్కని వ్యాయామంగా ఉపయోగపడుతోంది. భక్తి భావాన్ని పెంపొందించేదుకు.. మా బృందం ద్వారా అనేక ఆలయాల్లో కోలాటం ప్రదర్శిస్తూ వస్తున్నాం. కోలాటం అనేది ప్రాచీన కళ.. దీనిపై ఆసక్తి అవసరం. అలాగే భగవంతునికి మా వంతు సేవ చేసినట్టువుతోంది. భక్తి పాటలకు పదం కలుపుతూ సాగుతున్నాం.

–బచ్చు పద్మలత, హరిహర భజన బృందం

కోలాటంలో శిక్షణ ఇస్తున్నాం



కోలాటాన్ని సరదాగా నేర్చుకున్నాను.. పెదగంట్యాడతో పాటు పెద్ద పెద్ద ఆలయాల్లో, ఇతర ప్రదేశాల్లోనూ ప్రదర్శనలు ఇస్తున్నాను. నేర్చుకున్న కళకు న్యాయం చేస్తున్నాను. విస్తృతంగా ప్రచారం చేస్తున్నాను. మా బృందంలోని సభ్యులతో పాటు కొత్తగా వచ్చిన వారికి, ఆసక్తి ఉన్న వారికి కూడా శిక్షణ ఇస్తున్నాం. కోలాటం ద్వారా ప్రాచీన కళకు నా వంతు సేవ చేస్తున్నాను. చిన్నారులకు కూడా శిక్షణ ఇస్తున్నాను. –శ్వేత విజయ, శ్రీశక్తి భజన బృందం

ఇంటర్ వర్సిటీ కరాటే పోటీలకు ఏయూ విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న విజయ మోహన్

విశాఖ విద్య: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఏయూ క్రీడాకారులు అర్హత పొందినట్లు ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పురుషుల కరాటే పోటీలు 15 నుంచి 18 వరకు ఎండీ యూనివర్శిటీ రోహతక్‌లో జరిగే పురుషుల కరాటే పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ఎంసీఏ విద్యార్థి వి.బాలసూర్య, 19 నుంచి 21 వరకు జరిగే మహిళల పోటీల్లో సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల బీకాం విద్యార్థి సీహెచ్ ప్రవల్లిక పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను వ్యాయామ విద్య విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి, ఏయూ దూరవిద్య కేంద్రం అసిస్టెంట్ ప్రొఫె సర్ డాక్టర్ దొరబాబు, జట్టు మేనేజర్ అండ్ కోచ్ చిన్నారావు అభినందించారు.